TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

సెల్ : 9440060406


నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 | సంచిక :137 | prajadivvs57@gmail. com | శుక్రవారం 27, మార్చి 2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 4 | వెల : 3/-

# 13మంది సజీవ దహనం

## మార్కాపురం వద్ద ఘోర ప్రమాదం

- టిప్పర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ ▪ క్షణాల్లో వ్యాపించిన మంటలు
- జగిత్యాల నుంచి కనిగిరి వెళ్తుండగా తెల్లవారుజామున విషాదం
- 28 మందికి తీవ్ర గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం
- ప్రధాని మోదీ, సీఎంలు, మంత్రుల తీవ్ర దిగ్భ్రాంతి



“ మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలోని పలకల క్వారీల వద్ద గురువారం తెల్లవారుజామున గుండెలు పిండేసే విషాదం చోటుచేసుకుంది. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ భీకర ప్రమాదంలో బస్సులోని 13 మంది ప్రయాణికులు బయటకు రాలేక లోపలే సజీవ దహనమయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 41 మంది ప్రయాణికులు ఉన్నారు. ”

మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమిపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతో పాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 13 మంది ప్రయాణికులు సజీవ దహన మయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో స హాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సును హ రికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున ఆరుగంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మిగతా 2 లో

# గత ప్రభుత్వ బకాయిలు కడుతున్నాం



**ఆరోగ్యశ్రీ కింద 600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు**

## ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించాం

- విద్య, వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం
- సీఎంఆర్ఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారు
- అన్ని బాగోతాలు బయటపెట్టబోతున్నాం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాసుపత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు.

పేదల వైద్యం కోసం 27 నెలల్లో రూ.4,500 కోట్లు చెల్లించామని సీఎం రేవంత్ వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియో గం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని మరోసారి తేల్చి చెప్పారు.

మిగతా 2 లో

# పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

- మిషన్ భగీరథ పేరుతో డబ్బు దుబారా
- దీనిపై ఎక్కడికైనా వెళ్లి పరిశీలిద్దామా
- సభలో బిఆర్ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డ భట్టి

2





# ఆరోగ్యశ్రీపై అసత్యాలు

- మైక్ కట్ చేసి గొంతు నొక్కే ప్రయత్నం..
- ఖర్చుల పెంపు సహజం.. ఘనతేమీ లేదు
- మాజీ మంత్రి.. ఎమ్మెల్యే హరీష్ రావు
- ఆసుపత్రుల నిర్మాణంలో జాప్యంపై విమర్శ



# నేడు సీఎంలతో ప్రధాని 'వార్' మీటింగ్!

చమురు సంక్షోభంపై అత్యవసర సమీక్ష

# రాష్ట్రంలో ఇంధన కొరత లేదు

## ఆందోళనకు గురి కావద్దు

### పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు.

2





## నేటి నుంచి మూడ్రోజులు బ్యాంకులకు సెలవులు




## వినియోగదారులకు నయారా షాక్


పెట్రో, డీజిల్ ధరలు పెంచి



# ప్రపంచ దేశాలకు భారీ ఊరట

- తెరుచుకున్న 'హర్మూజ్' జల సంధి!
- భారత్ సహా మిత్ర దేశాల సరుకు రవాణాకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్
- రంగంలోకి దిగిన ఐక్యరాజ్యసమితి..
- చమురు, గ్యాస్ రవాణా కష్టాలకు చెక్
- ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ అధికారిక ప్రకటన



## అమెరికాను ఎదుర్కొనేలా ఇరాన్ ఎత్తులు

- ఖర్గ్ ఐలాండ్‌లో భారీగా మందుపాతరలు

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక



# 13మంది సజీవ దహనం



మొదటి పేజీ తరువాయి

వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి. నరేంద్ర (25), నల్లగొండ్ల, టి. చందన (21), నల్లగొండ్ల, టి. చందు (6), నల్లగొండ్ల , కె. ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి. గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోనినిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. బస్సు ప్రమాదంపై మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

## ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి

**మృతుల కుటుంబాలకు 2లక్షలు, క్షతగాత్రులకు 5వేల పరిహారం**

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం సమీపంలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్‌గ్రేషియా పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి అందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ మేరకు పీఎంఓ కార్యాలయం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ప్రమాదంపై స్పందిస్తూ, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## నేటి నుంచి మూడ్రోజులు బ్యాంకులకు సెలవులు

**ప్రజానావ, హైదరాబాద్:** బ్యాంకులకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రాబోతున్నాయి . శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు పని చేయవు. శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం సెలవు. అలాగే నాలుగో శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు తెరుచుకోవు. దీంతో సోమవారమే బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయి. చెక్ క్లియరెన్స్‌లు, డాక్యుమెంట్ సబ్మిషన్, ఇతర వ్యక్తిగత సేవల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకుంటే సోమవారం వరకు ఆగాల్సిందే.

## ఇంధన కొరత లేదు

**ప్రజలు ఆందోళనకు గురి కావద్దు**

**పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**

రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. అలాగే 10,799 లీటర్లు సరఫరా చేశారని వివరించారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు. 22,127 కిలో లీటర్ల డీజిల్ ఆయిల్ కంపెనీలు సరఫరా చేశాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ 596 అవుట్ లెట్స్ ఉన్నాయని అన్నారు. ప్రతీ బంక్‌లో పౌరసరఫర, సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ అధికారుల బృందం పరిశీలన చేస్తుందని తెలిపారు. బుధవారం కంటే.. గురువారం పెట్రోల్ బంకుల వద్ద రద్దీ తగ్గిందన్నారు. రాష్ట్రంలో గృహ వినియోగంలో 1,28,24,087 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని.. ప్రతీ రోజు 2,20,000 గ్యాస్ బుకింగ్స్ జరుగుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం ఒక్క రోజే 2,19,980 సిలిండర్లు సరఫరా చేశామన్నారు. వినియోగదారులు అధికంగా బుకింగ్స్ చేయడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడుతుందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు. అలాగే 1,03,275 పైప్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 2,78,418 క్యూబిక్ మీటర్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు పీఎన్జీ, సీఎన్జీని విస్తరించాల్సి ఉందని చెప్పారు. 24 గంటల్లో ప్లాంట్లకు అనుమతి ఇవ్వడంతో పాటు పలు రాయితీలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు.

## వినియోగదారులకు నయారా షాక్

**న్యూఢిల్లీ:** ప్రైవేటురంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ వినియోగదారులకు షాకిచ్చింది. లీటరు పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచింది. పెరిగిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఆయా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పెంపు గరిష్ఠంగా రూ.5.30 వరకు ఉంటుంది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ పంపులు ఉండగా.. రష్యా చమురు సంస్థ అయిన రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ 6,967 పెట్రోల్ పంపులను ఆపరేట్ చేస్తోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను సవరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరో ప్రముఖ ప్రైవేటురంగ చమురు సంస్థ రిలయన్స్-బీపీ మాత్రం పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. దేశవ్యాప్తంగా 2,185 ఔట్‌లెట్లను జియో-బీపీ నిర్వహిస్తోంది. సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వరంగ చమురు కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మాత్రం సాధారణ పెట్రోల్, డీజల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ప్రీమియం పెట్రోల్ ధరను మాత్రం రూ.2.30 మేరకు ఇటీవల సవరించాయి. ఇండస్ట్రియల్ డీజిల్‌ను లీటరుకు రూ.22 చొప్పున పెంచాయి.

# గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

మొదటి పేజీ తరువాయి

27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకు వస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఆ పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు.





### కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్స్ పెరగాలి

తెలంగాణలో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడతానంటే ఎలా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ ఆర్ ఫండ్స్ మెరుగు గా లేవని అన్నారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ మరిన్ని తెలంగాణ లో ఖర్చు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సీఎస్ ఆర్ ఫండ్స్ ఎక్కువ ఖర్చు చేసిన వారిని గుర్తించి ప్రభుత్వం తరపున సత్కరించాలన్నారు. సీఎస్ ఆర్ ఫండ్స్ కోసం వెబ్సైట్ ఏర్పాటు చేయాలి..సీఎస్ఆర్ ఫండ్స్ ను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి..ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ ఫండ్స్ కోసం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సంస్థలు కనీసం 50 శాతం సీఎస్ఆర్ ఫండ్స్ కచ్చితం గా ఇక్కడే ఖర్చు పెట్టాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, సి ఎం ఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి,సిఎంఓ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి,సిఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్ ,ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ప్రయాణికులకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు

**స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి**


**స్టేషన్ల వద్దకు ఆర్టీసీ సర్వీసులు పొడిగించాలి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు.. వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్‌యూఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.

# పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

- **మిషన్ భగీరథ పేరుతో డబ్బు దుబారా**
- **దీనిపై ఎక్కడికైనా వెళ్లి పరిశీలిద్దామా**
- **సభలో బిఆర్ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డ భట్టి**



బీఆర్ఎస్ శాసనసభ్యులు పద్దులపై చర్చను పక్కనపెట్టి, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చురకలంటించారు.. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి గత ప్రభుత్వం గొప్పలు చేసిందని చెప్పడానికి ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో మహిళా శిశు సంక్షేమం పంచాయతీరాజ్ పద్దులపై జరుగుతున్న చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. పెళ్లయి బిడ్డ సంకలోకి వచ్చినా కల్యాణ లక్ష్మి చెక్కు అందలేదు' అని ఎమ్మెల్యే సునీత చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే, ఆ ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా పరిశీలిస్తుందన్నారు. సాధారణంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి జాప్యం జరగడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడం వల్లో, దరఖాస్తు చేయడంలో జాప్యం వల్లో లేదా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లో జరిగి ఉండవచ్చు. దీనిపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతాం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చిందా? లేక పైపుల కంపెనీల ప్రయోజనం కోసం తెచ్చిందా అని అన్నారు. ఈ పథకం కోసం దాదాపు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేశామని లెక్కలు చెప్పారు. కానీ ఎక్కడో దూరం నుంచి నీళ్లు తెచ్చి, ఫిల్టర్ చేసి పంపిణీ చేసే విధానం క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు కాలేదన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదు. ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోంది కానీ ప్రజలకు మాత్రం అందడం లేదన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరిగ్గా నీరు అందిన పరిస్థితి లేదు. కేవలం లీకేజీలు, మరమ్మతులతోనే కాలం గడుస్తోంది. కొత్త పథకం పేరుతో స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, అప్పటికే పనిచేస్తున్న పాత నీటి పథకాలకు తాళాలు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేద్దాం. ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో, క్షేత్రస్థాయి వాస్తవాలు ఏంటో ప్రత్యక్షంగా పరిశీలిద్దాం అన్నారు. ప్రతిపక్ష నేతలు సభను, ముఖ్యమంత్రిని మరియు మంత్రులను గౌరవించి మాట్లాడాలి. సభా మర్యాదలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం అని గుర్తు చేశారు.

# దావోస్ పెట్టుబడులపై 'శ్వేతపత్రం' సిద్ధం

- **రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు**
- **విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన మంత్రి శ్రీధర్ బాబు**



:దావోస్ పర్యటనలో కుదుర్చుకున్న పెట్టుబడులు.. ఒప్పందాలపై శాసనసభలో విపక్ష సభ్యులు చేసిన విమర్శలను మంత్రి శ్రీధర్ బాబు ఘాటుగా తిప్పికొట్టారు. ఈ పర్యటనల ద్వారా తెలంగాణకు మొత్తం 2.19 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. ప్రభుత్వం మొత్తం 44 ఎంఓయూలు కుదుర్చుకుందని.. ఈ ఒప్పందాల అన్నింటిపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

### వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు

ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 68,150 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి వివరించారు. కేవలం 2024 దావోస్ పర్యటనలోనే 18 ఒప్పందాలు జరిగాయని.. వాటి ద్వారా 40,232 కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలతో పాటు స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి దొరుకుతుందని ధీమా వ్యక్తం చేశారు. సుమారు 81,800 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టే ఆరు కంపెనీలకు ఇప్పటికే భూముల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని శ్రీధర్ బాబు వెల్లడించారు. దీని ద్వారా ప్రభుత్వానికి 1,540 కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. మరో మూడు కంపెనీలు 30 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని.. వాటికి అవసరమైన భూములను గుర్తించే పనులు జరుగుతున్నాయని వివరించారు.

### నిజామాబాద్ ఐటీ టవర్ పురోగతి

నిజామాబాద్ ఐటీ టవర్ కార్యకలాపాలపై కూడా మంత్రి సభలో స్పష్టతనిచ్చారు. అక్కడ ప్రస్తుతం 11 కంపెనీలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. మొత్తం 681 సీట్ల సామర్థ్యంతో నిర్మించిన ఈ టవర్‌లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నగరాల్లో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# రూ.5 లక్షల్లోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం

**- కేవలం మూడు నెలల్లోనే పనులన్నీ పూర్తి**

**-400 చదరపు ఫీట్లలో జిల్లాలోని ఆయా మండలాల్లో 11 మోడల్ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించిన గృహ నిర్మాణ శాఖ**

**- ఆధునిక సాంకేతికతతో ఫిల్లర్ రూఫింగ్ విధానంలో స్లాబ్ నిర్మాణం**

**- సొంత ఇంటి కల నిజం చేసుకోవాలనుకునే అర్హులకు సదవకాశం**




**రాజన్న సిరిసిల్ల, మార్చి -26 ప్రజా దివాస్**
ఇల్లు లేని వారి సొంత ఇంటి కల నిజం చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతుంది. మోడల్ హౌస్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించింది. 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలతో ఇల్లు పూర్తవుతుందని స్పష్టం చేసింది గృహ నిర్మాణ శాఖ. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతోనే నూతన సాంకేతికత, అద్భుతమైన డిజైన్ లో స్లాబ్ తో ఇందిరమ్మ ఇల్లు పక్కాగా నిర్మించింది.ప్రజా ప్రభుత్వం అర్హులైన వారి సొంతింటి కల నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. నిర్దేశించిన 400 నుంచి 600 చదరపు ఫీట్ల వరకు నిర్మించుకోవచ్చని, వారికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో నిర్మాణానికి అనుగుణంగా నేరుగా లబ్ధిదారు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా ఏర్పాట్లు చేసింది. పేదలకు 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలు ఇల్లు నిర్మించుకునేలా స్పష్టమైన కార్యాచరణ అవగాహన కల్పించాలని ఉద్దేశంతో గృహ నిర్మాణ శాఖ మోడల్ నిర్మాణాలను జిల్లాలో చేపట్టింది.

**జిల్లాలో 11 నిర్మాణాలు పూర్తి..**
గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 11 మోడల్ ఇందిరమ్మ మోడల్ ఇండ్లను 400 చదరపు ఫీట్లలో ఒక ప్రణాళిక ప్రకారం కేవలం మూడు నెలల కాలంలోనే రూ. ఐదు లక్షలతో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇబ్బందులు దూరం చేసేందుకు కమిటీల సేవలు గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రతి మోడల్ హౌస్ లో ఒక హాల్, బెడ్ రూమ్ దానికి అటాచ్డ్ బాత్రూం, అలాగే కిచెన్ సదుపాయాలతో ఇంటిని పూర్తి చేశారు. గోడల నిర్మాణానికి సిమెంటు ఇటుకలు వినియోగించారు. కిటికీలు, దర్వాజలు చెదలు పట్టకుండా చాలా కాలం మన్నికగా ఉండేలా సిమెంటు ఫ్రేములు వినియోగించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారు. ఇంటి నిర్మాణ సామగ్రి, ఇతర ఇబ్బందులను దూరం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

**ఎండాకాలం చల్లగా.. చలికాలం వెచ్చగా ..**
ఇందిరమ్మ మోడల్ హౌస్ లు ఎండాకాలంలో చల్లగాను.. చలికాలంలో వెచ్చగా ఉండేలా సాంకేతికతను ఉపయోగించారు. స్లాబు నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని వినియోగించారు. ఇందులో సాధారణ ఇళ్లతో పోలిస్తే స్లాబ్ నిర్మాణంలో 40 శాతం ఖర్చు ఆదా అవుతుంది. కాంక్రీట్, ఐరన్ తక్కువగా ఉపయోగిస్తారు. స్లాబ్ చూడడానికి కూడా ఎంతో అందంగా కనిపిస్తుంది.


**దీర్ఘకాలం పాటు మన్నికగా ఉండేలా..**
గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 లక్షలలోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. నాణ్యతలో కూడా ఇలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేశారు. దీర్ఘకాలం పాటు నిలిచి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయం లోనే ఇంటి నిర్మాణాన్ని చేశారు.

**ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ..**
జిల్లాలోని అర్హులైన వారు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఐదు లక్షల తోనే పూర్తిచేసేలా ప్రతి మండల కేంద్రం అలాగే మున్సిపాలిటీలో హౌసింగ్ అధికారులు పూర్తిస్థాయి సహకారం అందిస్తారు. అర్హులైన వారందరూ వారి సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకునే అవకాశం ఉంది.

## వేములవాడలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాలు

**- 8వ రోజు పూజలు వైభవంగా**






**వేములవాడ/ప్రజాదివాస్ మార్చి 26** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా 8వ రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామివారికి పంచోపనిషత్ విధానంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ రామచంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి, పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు ఘనంగా జరిపారు. శ్రీ సీతా చంద్రరామ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా యాగశాలలో పుణ్యాహవచనం, మూలమంత్ర హోమం, స్వామివారి పరివార దేవతల హోమాలు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కన్యాదాతలుగా మరింగంటి విజయసారథి-- కర్ణ దంపతులు పాల్గొన్నారు. వేద పండితులు ఈ పూజా కార్యక్రమాలను ఆచార్యులుగా నిర్వహించారు.శ్రీరామ నవరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు రామాయణ పారాయణం, శ్రీరామ గీత, ఆధ్యాత్మిక రామాయణ పారాయణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ రోజు సాయంత్రం 4:30 గంటలకు శంకరమఠంలో రామాయణ ప్రవచనం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.రాజన్న ఆలయం అభివృద్ధిలో భాగంగా నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేద పండితులు ఏకాంతంగా శాస్త్రోక్తంగా ఎలాంటి లోటు లేకుండా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకే 'ట్విన్నింగ్'.. ఉత్సాహంగా పాల్గొన్న నాంపల్లి, వేములవాడ పాఠశాలలు




**వేములవాడ/ప్రజాదివాస్ మార్చి 26** వేములవాడలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం 'ట్విన్నింగ్ స్కూల్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు నాంపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యా, క్రీడా, మరియు సాంస్కృతిక అంశాలలో తమ ప్రతిభను చాటారు. విద్యార్థులు పరస్పరం పరిచయం పెంచుకొని వివిధ కార్యకలాపాల్లో పాల్గొని సందడి చేశారు. ?ఈ సందర్భంగా వేములవాడ హెచ్.ఎం రాజారత్నం మరియు నాంపల్లి ఎంపీయూపీఎస్ హెచ్.ఎం వత్సల మాట్లాడుతూ.. పాఠశాలల మధ్య విద్యా అనుభవాలను పంచుకోవడం ద్వారా బోధనా విధానాలు మెరుగుపడత యని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, పరస్పర సహకార గుణాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో నాంపల్లి ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయులు ఉమాదేవి, రజిత, వినయ్ కుమార్, కమలాకర్ రెడ్డి, శైలజ, సనా మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్ కు ఉప సర్పంచుల శుభాకాంక్షలు



**కాల్వ శ్రీరాంపూర్ మార్చి 26(వెలుగు నిఘా)** కాల్వ శ్రీరాంపూర్ నూతన ఎమ్మార్వో గా బాధ్యతలు చేపట్టిన రామలకు మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచ్లు బుకే అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు తెలిపారు అభినందనలు తెలిపిన వారిలో గంగారం ఉపసర్పంచ్ మేడి అశోక్ గౌడ్, పందిళ్ళ ఉపసర్పంచ్ దర్ముల రవి, కిష్టంపేట ఉపసర్పంచ్ మహేష్, ఇదిలాపూర్ ఉపసర్పంచ్ నూనె హరీష్, చిన్న రాతుపల్లి ఉప సర్పంచ్ అనిల్, తారుపల్లి ఉపసర్పంచ్ స్వామి లు ఉన్నారు

## నూతన ఎమ్మార్వో కు టిఆర్ఎస్ నాయకుల శుభాకాంక్షలు




**కాల్వ శ్రీరాంపూర్ మార్చి 26(వెలుగు నిఘా)** కాల్వ శ్రీరాంపూర్ నూతన తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన రాపెల్లి రాములను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మండల టీఆర్ఎస్ నాయకులు శ్రీరాంపూర్ లో పనిచేసిన ఎమ్మార్వో జగదీశ్వర రావు బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన ఎమ్మార్వో రాములను కలిసి ఇక్కడి పరిస్థితుల గురించి ఇక్కడి ప్రజల సమస్యల గురించి భూముల గురించి తెలిపారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మార్వో తెలిపారు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ జడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మల్యాల సర్పంచ్ బూసి సదాశివరెడ్డి, మడిపల్లి సర్పంచ్ తీగల నాగరాజు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి

**చెరువు కొమ్ము తండా గ్రామ సర్పంచ్ భూక్య భాష**



**ఖమ్మం ప్రతినిధి మర్చి 26 ( వెలుగు నిఘా )** రఘునాధపాలెం మండలం చెరువు కొమ్ము తండా గ్రామంలో సర్పంచ్ భూక్య భాష ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన -- ప్రగతి పాలనలో భాగంగా 99 రోజుల ప్రగతి ప్రణాళి క కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో గ్రామాన్ని పరి శుభ్రంగా ఉంచేందుకు గ్రామ ప్రజలందరు సహకరించాలని గ్రామస్తులను కోరారు. గ్రామ పరిసరాలలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, ఇంటింటికి చెత్త బండి వచ్చినప్పుడు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరారు. దోమల నివారణ కొరకు మన ఇంటి పరిసరాలను శుభ్రంగ ఉంచుకోవాలని మహిళ లను కోరారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో మంచినీటి కొరత రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, గ్రామ ంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం అయ్యేవిదంగా కృషిచేస్తానని అన్నారు. శుక్రవారం శ్రీ రామనవమి పండుగ సందర్భంగా సీసీ రోడ్లు, గ్రామం శుభ్రంగా క్లీనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సబ్సిడీ ప్రియాంక, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఈదులాపూర్ ప్రభుత్వ పాఠశాలకు విద్యా సామాగ్రి అందజేత

**ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్ సంస్థ కు కృతజ్ఞతలు మాజీ ఎంపీపీ సారన్న**



**కాల్వ శ్రీరాంపూర్ మార్చి 26(వెలుగు నిఘా)** ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్ సంస్థఆధ్వర్యంలో కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఇద్దులాపూర్ప్రభుత్వ పాఠశాల కు సున్నం తోపాటు విద్యాసామాగ్రికిసంబంధించిన వస్తువులు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్ఫినిటీ చిన్ కార్స్ సొల్యూషన్స్ సంస్థ మేనేజర్ నూనె ప్రశాంత్, ఎంఈఓ మహేష్,కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ గ్రామ సర్పంచ్ మామిడి లత అశోక్, ఉప సర్పంచ్ నూనె హరీష్ ,స్కూల్ హెచ్ఎం దాస్, ఇన్ఫినిటీ సంస్థ స్టాప్స్ స్కూల్ స్టాప్స్ చెర్మన్ మాధవి అంగన్వాడి టీచర్స్ విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు, యూత్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కనగర్తిలో విషాదం.. ఉపాధి పనుల్లో వడదెబ్బతో కూలీ మృతి...

## - ఆరు నెలల వ్యవధిలోనే తండ్రీకూతుళ్ల మరణం..
## - కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం



**కొనరావుపేట మండలం/ప్రజాదివాస్ మార్చి 26** కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో గురువారం తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పులి రవి (38) ఉపాధి హామీ పనులకు వెళ్లిన సమయంలో ఎండ తీవ్రతకు తట్టుకోలేక వడదెబ్బకు గురయ్యారు. తోటి కూలీలు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, దురదృష్టవశాత్తు మార్గమధ్యలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. రవి మరణంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఆరు నెలల క్రితమే తన చిన్న కూతురు మరణించిన బాధ నుండి కోలుకోకముందే, ఇప్పుడు ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య నిర్మల, మరో చిన్న పాప అనాథలయ్యారు. అప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబాన్ని రవి మరణం మరింత కృంగదీసింది. ఈ ఘటనతో కనగర్తి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రభుత్వం స్పందించి, ఆపదలో ఉన్న ఆ పేద కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# కోనరావుపేటలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



**కొనరావుపేట మండలం/ప్రజాదివాస్ మార్చి 26** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ``==×ఎజు ``×ఎజు కార్యక్రమంలో భాగంగా గురువారం కోనరావుపేట మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కోనరావుపేట ఎస్సై కె. ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్య ంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం మరియు అజాగ్రత్త వల్ల అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సురక్షిత ప్రయాణంతోనే క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు స్థానిక వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంఘం కోసం కుర్చీల వితరణ



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 26 ప్రజా దివాస్** ఎల్లారెడ్డిపేట, మండలం బొప్పాపూర్ అంబేద్కర్ సంఘం(మాల)కు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ కుర్చీలను వితరణగా అందించారు. గురువారం సంఘం సభ్యులు తమ సంఘ భవనంలో సమావేశం కోసం కుర్చీల అవసరాన్ని గోవర్ధన్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రూ.50వేల విలువైన వంద కుర్చీలను తెప్పించి ఇచ్చినట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు గోవర్ధన్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నీరటి భాను, ఉపాధ్యక్షులు గడ్డం దేవరాజు, కార్యదర్శి నీరటి గోపాల్, క్యాషియర్ గడ్డం సత్యం,ముఖ్య సలహాదారులు బత్తుల నర్సింలు, తదితరులు ఉన్నారు.

# డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడిన 112మంది మందు బాబులకు జరిమానాలు:సి.ఐ వీరప్రసాద్





**వేములవాడ/ప్రజాదివాస్ మార్చి 26** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 112 మంది మందు బాబులు పట్టుబడగా వారిని వేములవాడ పోలీసులు ఈరోజు కోర్టులో ప్రవేశపెట్టగా 86 మందికి ఒక్కొక్కరికి 5000 రూపాయలు, 26 మందికి ఒక్కొక్కరికి 2000 రూపాయల జరిమానాలు విధిస్తు వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు..వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన మందు బాబులకు ఎస్.ఐ రామ్మోహన్ , ట్రాఫిక్ ఎస్.ఐ రాజు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు.ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ..ప్రతి రోజు పట్టణ ప్పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెల్లింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతయని,ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మూలవాగు ఇసుక దోపిడీని ఆపాండి: బిజెపి రూరల్ మండలాధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్



**వేములవాడ/ప్రజాదివాస్ మార్చి 26** వేములవాడ రూరల్ మండలంలో నెలకొన్న పలు సమస్యలపై బిజెపి మండలాధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని జయవరం నుండి బొల్లారం గ్రామాల పరిధిలో మూలవాగు నుండి యథేచ్ఛగా ఇసుకను తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి రైతులు సాగునీరు, తాగునీరు లేక అల్లాడుతున్నారని విమర్శించారు. జెసిబిలు పెట్టి టిప్పర్లతో ఇసుక తీయడం వల్ల వాగుపై ఉన్న బ్రిడ్జిల పిల్లర్లు బయటపడుతున్నాయని, తక్షణమే ఇసుక రీచ్‌లను ఇక్కడి నుండి తరలించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అనాలోచితంగా నిర్మించిన చెక్ డ్యామ్‌లను కూల్చివేసి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తి చేయకపోవడం వల్ల వర్షాకాలంలో పంట పొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే మల్లారం రోడ్డుపై నిర్మించిన బ్రిడ్జికి కనెక్టింగ్ రోడ్డు వేయకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇసుక టిప్పర్ల వల్ల దుమ్ము రేగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హన్మాజీపేట సర్పంచ్ జంకె మధు, నమిలిగుండపల్లి ఉపసర్పంచ్ గుంటి వంశీకృష్ణ, బిజెపి నాయకులు తోట శేఖర్, సుంకరి నరేందర్, పల్లికొండ నారాయణ, గుమ్మడి శ్రీనివాస్, మనోజ్, కల్లెట్ల నరేష్, ఆడేపు విజయ్, మారాజు దిలీప్, బండారి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవాలకు 300 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు: ఎస్పీ మహేష్ బి. గితే.



**వేములవాడ ప్రజాదివాస్ మార్చి 26** శుక్రవారం రోజున (27 తేదీ) వేములవాడ రాజన్న క్షేత్రంలో జరిగే సీతారాముల కళ్యాణోత్సవంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా 300 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈసందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రాముల వారి కళ్యాణం సందర్భంగా వేములవాడ రాజన్న క్షేత్రానికి భారీగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని , ఇన్‌చార్జ్ అధికారులు తమ క్రింది సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి,ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఎస్పీ సూచించారు. ఈనెల 28వ తేదీ శనివారం నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ రాజీ పడదగిన కేసులను గుర్తించాలని సూచించారు.అలాగే, సంబంధిత కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకునేలా ప్రోత్సహిస్తూ రాజీ కుదిరే విధంగా చైతన్యం కల్పించాలని పేర్కొన్నారు. ఈసమావేశంలో డిఎస్పీ లు నాగేంద్రచారి,శ్రీనివాస్,సి.ఐ లు శ్రీనివాస్, వీరప్రసాద్, మొగిలి,ఎస్.ఐ లు పాల్గోన్నారు

# అశ్విని ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ జి .సత్యనారాయణ స్వామికి ప్రశంసలు

### జిల్లా కలెక్టర్ చే సత్కారం, ప్రశంసా పత్రం స్వీకరణ

### 40 ఏళ్లకు పైగా అందిస్తున్న వైద్య సేవలకు దక్కిన గౌరవం



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 26 ప్రజా దివాస్** ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని అశ్విని ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ జి. సత్యనారాయణ స్వామి చేసిన సేవలకు గాను జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ చే సత్కారం, ప్రశంసా పత్రం అందుకున్నారు.వైద్యులుగా వైద్య సేవలు అందిస్తూనే తనసొంత ఖర్చులను వెచ్చించి ప్రతి నెల 60 మంది టి బి రోగులకు న్యూట్రిషన్ కిట్లు వారి ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అశ్విని ఆసుపత్రి నీ నెలకొల్పి 40 ఏళ్లుగా రోగులకు వైద్య సేవలు అందిస్తూ పలు సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు అవుతున్నారు.తన వృత్తిలో రాణిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టినటి.బి విముక్త్ అభియాన్ పథకంద్వారా టి బి వ్యాధితో బాధపడే 60 మంది రోగులు ఆరోగ్యంగా జీవించుటకు 4000 రూపాయల విలువచేసే న్యూట్రిషన్ కిట్లను ఆరు నెలల పాటు తన స్వంత ఖర్చులతో ఉచితంగా అందిస్తున్నారు. డాక్టర్ సత్యనారాయణ స్వామి చేస్తున్న పలు సేవలను గుర్తించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సిఫారసు తో జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ డాక్టర్ సత్యనారాయణ స్వామిని శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రం అందించి గౌరవించారు.ఆయన చేస్తున్న సేవలకు ఆయననను కలెక్టర్ అభినందించారు.జిల్లా కలెక్టర్ చే ప్రశంసా పత్రం అందుకొని సన్మానం పొందిన డాక్టర్ సత్యనారాయణ స్వామికి మండలంలోని పలువురు వైద్యులు,ప్రజా ప్రతినిధులు,జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.